క్లుప్తంగా

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

బి.కొత్తకోట: వరుసగా నాలుగో ఏటా విద్యార్థులకు అమ్మఒడి పథకం అమలు చేసినందుకు ధన్యావాదాలు తెలుపుతూ సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి చిత్రపటాలకు తల్లులు, వలంటీర్లు పాలాభిషేకం చేశారు. తమ ఖాతాలకు రూ.13వేలు జమ చేశారని హర్షం వ్యక్తం చేశారు. సీఎం, ఎమ్మెల్యేకు మద్దతుగా నినాదాలు చేశారు.

ప్రతి డిపో నుంచి తిరుమలకు బస్సు సర్వీసులు

పీలేరు రూరల్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుమలకు అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని అన్ని డిపోల నుంచి తిరుమలకు బస్సు సర్వీసులు త్వరలో ప్రారంభించనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ డైరెక్టర్ ఎ. రాజారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో తిరుమలకు అన్ని డిపోల నుంచి బస్సు సర్వీసులు ఉండేవని, అయితే కొంతకాలంగా రద్దు చేశారన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, భక్తుల కోరిక మేరకు తిరుమలకు బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రేబీస్ టీకాలను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా మదనపల్లె వెటర్నటీ ప్రాంతీయ వైద్యశాలలో ఉచితంగా అందించే రేబీస్ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల ఏడీఏ డాక్టర్ రోహిణి తెలిపారు. టీకాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. పెంపుడు కుక్కల యజమానులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

పీలేరు ఎంఈఓగా లోకేశ్వర్‌రెడ్డి



పీలేరు రూరల్ : పీలేరు మండల విద్యాశాఖ అధికారి–1గా లోకేశ్వర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఇన్‌చార్జి ఎంఈవో రెడ్డిబాషా బదిలీపై కేవీపల్లెకు వెళ్లారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న వై. లోకేశ్వర్‌రెడ్డి పదోన్నతిపై పీలేరు ఎంఈవో–1గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలువురు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు.

ఎంఈఓ–2గా రాజగోపాల్

మదనపల్లె సిటీ: మదనపల్లె రెండవ ఎంఈఓగా రాజగోపాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఆర్‌సి కార్యాలయంలో అతడిని ఎంఈఓ–1 ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది అభినందించారు. యుటీఎఫ్ నాయకులు రవిప్రకాష్, సుదాకర్, పురం రమణ, హేమలత తదితరులు అభినందించారు.

ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్

మదనపల్లె : గ్రామ పంచాయతీ కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షులు డి.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీటీఎం రోడ్డులోని డీఎల్‌పీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు 2012 నుంచి ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని ఆదేశాలు ఉన్నా ఎక్కడా అమలు చేయలేదన్నారు. గతంలో డీఎల్‌పీఓకి చాలాసార్లు నోటీసులు ఇచ్చినా ఇంత వరకు పట్టించుకోలేదన్నారు. ఈ మేరకు డీఎల్‌పీఓ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు సురేంద్ర, ప్రధాన కార్యదర్శి నాగరాజు, సీఐటీయూ మండల అధ్యక్షులు వెంకటేష్, గోపాల్, నరసింహులు, రంగస్వామి, రవి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలపై అవగాహన

పెద్దమండ్యం: ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బెంగళూరు క్రై సంస్థ సహకారంతో జీవన నైపుణ్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వెలిగల్లు, చెరువుకింద పల్లె గ్రామాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు, సంరక్షకుల బాధ్యతల గురించి ఆటలు, పాటల రూపంలో వివరించారు. పిల్లల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. పిల్లలకు యుక్త వయస్సులో వచ్చే మార్పులపై, బాలల హక్కుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. పిల్లల పెంపకంలో సమస్యలు, ఎవ్వరిని నొప్పించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో క్రై సంస్థ ప్రతినిధులు రమేష్, శ్రీరాములు, ఫోర్డ్ సంస్థ మండల కన్వీనర్ నరసింహులు, కో ఆర్డినేటర్ శ్రీధర్, సిబ్బంది రెడ్డెమ్మ, అనిత, నరసింహులు, రమణ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న సురక్ష సర్వే

తంబళ్లపల్లె: వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్ కోరారు. సోమవారం కన్నెమడుగు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. జగనన్న సురక్ష సర్వేపై ఆరా తీశారు.

అర్హులందరికీ పథకాలు అందాలన్నదే లక్ష్యం

- జగనన్న సురక్ష క్యాంపులకు విశేష స్పందన
- ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేసిన లబ్ధిదారులు
- ఉచితంగా 11 రకాల ప్రభుత్వ సేవలు





రేగంటివారిపల్లె పంచాయతీలో సర్టిఫికెట్లు అందజేస్తున్న చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మట్లివారిపల్లె సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

మదనపల్లె : అర్హులకు వందశాతం పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని రామారావుకాలనీ, రామ్‌నగర్ వార్డు సెక్రటేరియట్, మండలంలోని రేగంటివారిపల్లె, పొన్నూటిపాళ్యం పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, ఎంపీడీఓ భానుప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఎంపీపీ రెడ్డెమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, తహసీల్దార్ మహబూబ్‌చాంద్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ...కులం, మతం, ప్రాంతం, పార్టీలు చూడకుండా...లంచాలు, వివక్ష లేకుండా.. అర్హత ఒక్కటే ప్రామాణికంగా రాష్ట్రంలోని 87శాతం కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులకు లంచం ఇవ్వకుండా, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పని జరిగేది కాదన్నారు. నేడు జగనన్న ప్రభుత్వంలో ప్రభుత్వ అధికారులు ఇంటివద్దకే వచ్చి ప్రజలకు అవసరమైన అన్ని సేవలు అందించడమే కాకుండా సమస్యలు తెలుసుకుని మరీ పరిష్కరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బండపల్లి ఈశ్వరమ్మ, మల్లికార్జున, ఎంపీటీసీలు భారతి, అనసూయ, బెల్లేహారతి, వైస్ ఎంపీపీలు డిష్ రమణ, నందినితాజ్, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, కౌన్సిలర్లు భానుప్రకాష్, పాలగిరిరమీజా, మేడికుర్తిలత, పాల్‌చంద్రశేఖర్, పసుపుపాడిరవి, డిష్‌రామకృష్ణారెడ్డి, బి.ఏ.ఖాజా, మేస్త్రీ శ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, ఎస్వీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉచితంగా సేవలు

వాల్మీకిపురం: జగనన్న సురక్ష క్యాంపులలో ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలందిస్తున్నామని తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్ అన్నారు. సోమవారం మండలంలోని విఠలంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి, లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్షలో కుల, ఆదాయ, వివాహ, జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఆధార్‌కు మొబైల్ నంబర్ అనుసంధానం, మ్యూటేషన్ లావాదేవీలు, ఫ్యామిలీ మెంబర్ల సర్టిఫికెట్, కొత్త రేషన్ కార్డులు, హౌస్ హోల్డింగ్ మ్యాప్ వంటి సేవలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్వేత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ఆశయం

బి.కొత్తకోట: ప్రజల సంక్షేమమే ఆశయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మదనపల్లె డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి లక్ష్మీపతి అన్నారు. సోమవారం బి.కొత్తకోటలో జగనన్న సురక్ష కార్యక్రమం సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై భారం పడకుండా కోరినవెంటే 11 రకాల రెవెన్యూ సేవలను ఉచితంగా అందిస్తోందన్నారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. అనంతరం ప్రజలకు ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ రఫీక్ అహ్మద్, డీటీ అహ్మద్ అన్సారీ, మేనేజర్ రమాదేవి, బిల్డింగ్ సొసైటీ మాజీ వైస్‌చైర్మన్ జీవీ.రామకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డిహరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ జగనన్న సురక్ష ప్రయోజనాలు

కలకడ : మండలంలోని ఇంటింటికీ జగనన్న సురక్ష ప్రయోజనాలు అందాలని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం కోన సచివాలయంలో సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సచివాలయ, వలంటీర్ల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఇంటింటికీ అందించే నవరత్నాలతో పాటు సచివాలయం పరిధిలో అందించే ధ్రువపత్రాలు సైతం ఉచితంగా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మునిరాజ, వీఆర్‌ఓ రవిచంద్రన్, వైఎస్సార్ సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ పథకాలు

కురబలకోట: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే జగనన్న సురక్ష లక్ష్యమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మట్లివారిపల్లెలో సర్పంచ్ సోమిరెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష లాంటి కార్యక్రమం దేశ చరిత్రలో ఇదే ప్రథమమన్నారు. సాధారణంగా ఎక్కడైనా సమస్యలు ఉంటే ప్రజలే అధికారుల వద్దకు వస్తారన్నారు. సీఎం జగన్ పాలనలో అలా కాకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులను ప్రజల వద్దకే పంపుతూ వాటిని పరిష్కరిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎక్కడ ఏమి అవసరమో చేసి చూపిస్తున్నామన్నారు. బైసాని జ్యోతి, చంద్రశేఖర్ రెడ్డి, బి. దస్తగిరి, ఎన్వీ రమణారెడ్డి, సర్పంచ్ సోమిరెడ్డి, డీఆర్. ఉమాపతిరెడ్డి, శివశంకర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, ఫజరుల్లా, ఆర్కేకృష్ణారెడ్డి, తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు, ఎంపీడీఓ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన నాక్ బృందం

పీలేరు రూరల్ : స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం సందర్శించింది. రెండు రోజుల తనిఖీలో భాగంగా సోమవారం ఆర్ఆర్‌బీఎం విశ్వవిద్యాలయం ఆల్వార్ రాజస్థాన్ ఉపకులపతి ఆచార్య శీల్‌సింధు పాండే కళాశాలను తనిఖీ చేశారు. కళాశాలలోని వివిధ అంశాలను మదింపు చేసి గ్రేడ్ ఇవ్వనున్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, మహిళా సాధికారిత విభాగం, కంప్యూటర్, రసాయన శాస్త్రం, వాణిజ్య శాస్త్రం విభాగాలను సందర్శించారు. కార్యక్రమంలో రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయం, బెల్గాం అర్థశాస్త్ర ఆచార్యులు ఆచార్య తల్వార్ సభన్న, మహారాష్ట్రలోని సతారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాలకృష్ణ కామ్లే, కళాశాల విద్య ప్రత్యేకాధికారి డాక్టర్ విజయబాబు, ఎస్వీయూ రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్, పిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ నారాయణస్వామి పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కలికిరి: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇంటి వద్దనే అందుతున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. మండలంలోని కలికిరి–2 గ్రామ సచివాలయం పరిధిలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ క్యాంప్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పీసీ ప్రోగ్రాంలో హాజరయ్యే రోగుల ఆరోగ్య వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించి, విధిగా మందులు ఉచితంగా అందజేయాలన్నారు. ప్రభుత్వం లక్ష్యం మేరకు వైద్య సదుపాయాలను పేదలకు చేరువచేయాని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మేడికుర్తి వైద్యాధికారి చిన్నరెడ్డెప్ప, హెచ్ఈ రఫీ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్వారీ పనులను నిలిపి వేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ మహమూద్

పెద్దతిప్పసముద్రం: మండలంలోని పులికల్లు సమీపంలోని గుడ్డంపల్లి వద్ద ఉన్న గ్రానైట్ క్వారీలో పేలుళ్ల శబ్దాలకు గృహాలతో పాటు పాఠశాలల గోడలు కూడా నెర్రెలు బారాయని తక్షణం క్వారీ పనులను నిలుపుదల చేయాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ మహమూద్ అధ్యక్షతన జరిగిన మండల్ మీట్‌లో ప్రజా ప్రతినిధులు పలు శాఖల అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మద్దయ్యగారిపల్లి వాసులకు మంజూరైన గృహ లబ్దిదారులకు లేఅవుట్ కేటాయించినా ఇంత వరకూ ప్లాట్లు మాత్రం చూపలేదన్నారు. మహిళా సంఘాల సభ్యుల నుంచి పలువురు సంఘమిత్రలు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. అలాగే స్త్రీనిధి రుణాల రికవరిలో అధికారులు అలసత్వం వహించడంతో అర్హులైన వారు రుణాల మంజూరు కోసం కళ్లకు ఒత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారన్నారు. తద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరిస్తున్నారని సర్పంచ్ రహ్మతుల్లా సభ దృష్టికి తీసుకొచ్చారు. బూర్లపల్లి సమీప గ్రామాల్లోని పలువురు రైతులు 2020 వాటర్‌షెడ్ ప్రాజెక్టుకు రాయితీలో మంజూరయ్యే వ్యవసాయ, యంత్ర పరికరాల కోసం రూ.1.40 లక్షలు చెల్లించినా ఇంత వరకు అతీగతీ లేకుండా పోయిందని సర్పంచ్ అసహనం వ్యక్తం చేశారు. పశు సంవర్థక శాఖకు మంజూరయ్యే విత్తనాలు, మందులు పక్కదారి పడుతున్నాయని పులికల్లు ఎంపీటీసీ సభ దృష్టికి తెచ్చారు. మండల్ మీట్‌లో వచ్చిన సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. వైస్ ఎంపీపీలు పప్పు క్రిష్ణవేణమ్మ, పట్టెరిక శోభా, జెడ్పీటీసీ శివన్న, కోఆప్షన్ ఖాదర్‌వలి, వ్యవసాయ సలహా మండలి జిల్లా మెంబర్ కుమార్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్‌తో పాటు పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని నిరసన

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటలో సోమవారం గ్రామస్థులు, విద్యార్థులు ఆర్టీసీ బస్సును అడ్డుకున్నారు. గతంలో ఈ రూట్‌లో రెండు బస్సులు నడిచేవని గ్రామస్తులు తెలిపారు. గత ఎనిమిది నెలల ఒక్క బస్సు మాత్రమే నడుస్తుండటంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు సకాలంలో గమ్యం చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ లోకేష్, ఎంపీటీసీ రవికుమార్ ప్రజా అవసరాలను గుర్తించి మదనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఫోన్‌లో సమస్యను వివరించారు. రెండు రోజుల్లో అదనపు బస్సు సర్వీసును పునరుద్ధరిస్తామని డీఎం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అసత్య కథనాలతో నల్లారి నాటకాలు

పీలేరు : ఓ ప్రతికలో వచ్చిన అసత్య కథనాలతో టీడీపీ నాయకుడు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి నాటకాలు ఆడుతున్నారని ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక గ్రామ సంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 17 సంవత్సరాల లోపు పిల్లలను దొంగ ఓట్లుగా చేర్పిస్తున్నారని అసత్య కథనాలను ఓ ప్రతిక వండివార్చిందన్నారు. దీనికి వత్తాసు పలుకుతూ కిషోర్‌కుమార్‌రెడ్డి తన ఇష్టానుసారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలపై అనుచిత వాఖ్యలు చేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఆధార్‌లో చేర్పులు మార్పులు, ఓటర్ల నమోదు పారదర్శకంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని తెలిపారు. కనీస ఇంగిత జ్ఞానం లేకుండా అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, వైస్ ఎంపీపీలు ఎస్.వి. చలపతి, హరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించండి

– ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆర్డీఓ ఎం.ఎస్. మురళి అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మదనపల్లె మండలంలోని బొమ్మనచెరువు పంచాయతీ సందిరెడ్డిగారిపల్లె తూర్పుదిక్కు స్మశానం భూమి నుంచి చెంబకూరు మెయిన్‌రోడ్డులోకి వెళ్లే దారిని కొందరు ఆక్రమించి గ్రామస్తులను ఇబ్బందులు పెడుతున్నారని సందిరెడ్డిపల్లెకు చెందిన నాగేంద్ర ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి, దారి సౌకర్యం కల్పించాల్సిందిగా కోరారు. మున్సిపాలిటీలో జరిగిన స్పందన కార్యక్రమంలో 13వవార్డు టీవీయస్ షోరూమ్ దగ్గర మూడురోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని రఫీక్ అహ్మద్ ఫిర్యాదుచేశారు. మోతీనగర్ ఎస్‌వీఆర్ స్ట్రీట్‌లో డాక్టర్.చంద్రమోహన్ ఇంటి కల్వర్టు, కాలువ రిపేరి చేయాల్సిందిగా, అలాగే ఆర్.ఆర్. క్యాటరింగ్ రెసిడెన్సియల్ ఏరియాలో రోడ్డుమధ్యలో ఉండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ఫిర్యాదు చేశారు. తనకు ఫింగర్ ప్రింట్స్ రావడం లేదని, ఐరిష్ విధానంలో ఇంటికి వచ్చి ఫించను ఇవ్వాల్సిందిగా డి.ధర్మరాజు కోరారు. సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించాల్సిందిగా కమిషనర్ కే.ప్రమీల, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి సిబ్బందిని ఆదేశించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



జ్యోతి వెలిగిస్తున్న ముంతాజ్‌అలీ, ఎమ్మెల్యే నవాజ్‌బాషా తదితరులు

మదనపల్లె : సత్సంగ్ ఫౌండేషన్ స్వాస్థ్య ఆస్పత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే నవాజ్ బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని నక్కలదిన్నెలో గురుపూర్ణిమ సందర్భంగా సోమవారం పద్మభూషణ్, సత్సంగ్ ఫౌండర్ (ముంతాజ్‌అలీ) సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి ఆస్పత్రిని లాంఛనంగా ప్రారంభించారు. తొలుత జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి గురువు మహేశ్వరనాథ్ బాబాజీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీ ఎం మాట్లాడుతూ... మదనపల్లె పట్టణానికి తలమానికంగా, పేదప్రజలకు అందుబాటులో సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వాస్థ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను గురుపూర్ణిమ రోజున ప్రారంభిస్తున్నామన్నారు. ఆస్పత్రిలో మెడిసిన్, సర్జరీ, ఎమర్జెన్సీ, క్రిటికల్‌కేర్, ఆర్థోపెడిక్, సైకియాట్రీ, వైద్యసేవలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సేవాదృక్పథంతో నామమాత్రపు ఫీజులతో వైద్యసేవలు అందిస్తామన్నారు. మంగళవారం నుంచి ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్.వెంకటరమణ, డాక్టర్.శ్రీనివాస్, డాక్టర్.ప్రియం, సత్సంగ్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు

నిమ్మనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గత నాలుగేళ్లుగా గడపగడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం రెడ్డివారిపల్లె పంచాయతీలోని పిట్టావాండ్లపల్లె, వడ్డిపల్లె తదితర గ్రామాల్లో సర్పంచ్ నూతనకాల్వ రెడ్డెమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ రామమోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గారబురుజు రమణారెడ్డితో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కొత్త ఇందిరమ్మ కాలనీ, పునుగుపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించటమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. అర్హత ఉండి పథకాలు రాని వారు ఉంటే వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని సంప్రదిస్తే సమస్యలను పరిష్కరిస్తారన్నారు. జగనన్న సురక్ష పథకాన్ని ఉపయోగించుకొని అవసరమైన సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. అధికారులు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

సద్గురు సాయినాథ్ మహరాజ్‌కి జై







వాల్మీకిపురం: ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చింతల, మదనపల్లె : ప్రత్యేక అలంకరణలో బాబా, తంబళ్లపల్లెలో..

మదనపల్లె సిటీ: గురుపౌర్ణమి వేడుకలు సోమవారం మదనపల్లె పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక కోటవీధిలోని శ్రీ షిర్డిసాయిబాబా ఆలయంలో ఉదయం గణపతి పూజ, దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, బాబాకు పంచకవ్య అభిషేకం, మహామంగళ హారతి ఇచ్చారు. భక్తులు బాబాకు స్వయంగా పాలతో అభిషేకం చేశారు. అర్చకులు సాయిచక్రవర్తి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

మార్మోగిన సాయి నామస్మరణ

వాల్మీకిపురం: సద్గురు సాయినాథ్ మహరాజ్‌కి జై అంటూ.. భక్తుల సాయి నామస్మరణతో వాల్మీకిపురం శ్రీషిర్డీసాయి నగర్‌లో వెలసిన శ్రీ షిర్డీసాయి ఆలయం మార్మోగింది. సోమవారం గురుపౌర్ణమిని పురస్కరించుకొని షిర్డీసాయి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్చనలు, విశేష పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంకాలం 6గంటలకు ధూప్‌హారతి, రాత్రి 9గంటలకు శేజ్ హారతి సేవలు జరిగాయి. అలాగే శ్రీ పట్టాభిరామస్వామి ఆలయం ఎదురుగా ఉన్న సత్యసాయి మందిరంలో బాబాకు విశేష పూజలు నిర్వహించారు. అలాగే పడమర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి దేవాలయంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ అరుణమ్మ, మాజీ జడ్పీటీసీ సభ్యులు చింతల శివానందరెడ్డి, మానవతా సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి, పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి

తంబళ్లపల్లె: మండలంలో పలు ఆలయాలలో సోమవారం గురుపౌర్ణమిని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మల్లయ్యకొండపై గౌరమ్మగుట్టలోని గౌరమ్మతల్లి ఆలయంలో పూజారి శేఖర్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు గౌరమ్మతల్లి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.పెద్ద ఎత్తున మహిళా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముద్దలదొడ్డి నేల మల్లేశ్వరస్వామి బజనమండలి కళాకారులు, కోటకొండ కళాకారులు శివకోటి నామస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన షిరిడీసాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. ఆలయ అర్చకులు అనిల్‌కుమార్ వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

పీలేరు రూరల్ : స్థానిక షిర్డిసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, హారతి కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు రంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

పెద్దమండ్యం: మండలంలోని పాపేపల్లె గ్రామంలో వెలసిన శ్రీ షిర్డిసాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి వేదపండితులు ప్రత్యేక అలంకరణ చేశారు. సమీప గ్రామాల ప్రజలు గురుపౌర్ణమి సందర్భంగా ఆలయానికి తరలి వచ్చారు. భక్తులకు నిర్వాహకులు గుడిశ వివేకానందరెడ్డి అన్నదానం చేశారు.